సీతాఫలం.. ధర ప్రియం



యాచారంలో సాగర్‌రోడ్డు పక్కనే విక్రయిస్తున్న రైతులు, వ్యాపారులు



మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా సీతాఫలాలు

- అధిక రేట్లతో రుచి చూడలేకపోతున్న జనం
- యాచారంలో మార్కెట్ లేక రోడ్డుపైనే క్రయవిక్రయాలు
- నేడు సీతాఫలాల మార్కెట్ నిర్వహణకు వేలం

యాచారం: 'సీతాఫలం ఎంతో బలం.. దానిలో ఉంది తియ్యని గుజ్జు' అంటూ అప్పటితరం వారు చిన్నప్పుడు ఈ ఫలం ప్రాధాన్యాన్ని వివరిస్తూ పాటలు పాడేవారు. పేదోడి ఆపిల్‌గా పేరుగాంచిన ఈ ఫలాన్ని ప్రస్తుతం సామాన్యులు రుచి చూడలేకపోతున్నారు. పైసా పెట్టుబడి లేకుండా ప్రకృతి ఒడిలో సీతాఫలాలు పుష్కలంగా లభిస్తాయి. సీజన్ వచ్చిందంటే గ్రామీణా ప్రాంతాల్లోని ప్రజలు ఈ ఫలాలను కడుపునిండా తిని, మిగతావి యాచారం మార్కెట్‌కు తెచ్చి విక్రయించేవారు. నాడు యాచారం, కడ్తాల్, కందుకూర్, ఆమనగల్లు, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని అనేక గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో సీతాఫలాల చెట్లు పెరగడానికి అనువుగా ఉండేవి. కొన్నేళ్లుగా వేలాది ఎకరాల్లో ఫార్మాసిటీకి భూసేకరణ చేయడం, రియల్ వ్యాపారులు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేయడంతో సీతాఫలాల చెట్లు క్రమంగా క్షీణిస్తున్నాయి. నాడు సహజ సిద్ధంగా ఆరగించే ప్రజలు నేడు మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు.

యాచారం మార్కెట్ ప్రసిద్ధి

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై సీతాఫలాల క్రయ, విక్రయాలకు మండల కేంద్రంలోని మార్కెట్ ఎంతో ప్రసిద్ధి. వర్షాలు సమృద్ధిగా కురిస్తే చెట్లకు పూత, కాత బాగా పట్టి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో సీతాఫలాలు మార్కెట్లోకి వస్తాయి. అప్పట్లో యాచారం మార్కెట్‌కు ఇతర జిల్లాలోని రైతులు, వ్యాపారులు వచ్చేవారు. మార్కెట్లో సీతాఫలాల కిలోకు పైగా సైజులో రుచికరంగా, చూడటానికి ఆకర్షించే విధంగా ఉండడంతో ఉమ్మడి ఏపీలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి ఫలాలను కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. అప్పట్లో సీతాఫలాల మార్కెట్ వల్ల వందలాది కూలీలతో పాటు, వ్యాపారులకు ఉపాధి దొరికేది. యాచారం గ్రామ పంచాయతీకి సైతం ఏటా మంచి ఆదాయం వచ్చేది.

ప్రస్తుతం వెలవెల

యాచారం మార్కెట్ ప్రస్తుతం సీజన్ ముగింపు దగ్గరపడుతున్న ఆశించిన విధంగా సీతాఫలాలు రావడం లేదు. ప్రస్తుతం పక్షం రోజులుగా ఆయా గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు సీతాఫలాలు తెచ్చే 150 కాయలుండే గంపకు రూ.600, 250 కాయలుంటే గంపకు రూ.1,500లకు పైగానే ధర పలుకుతుంది. ఒక్కో పండుకు రూ.10 వసూల్ చేస్తున్నారు. సీతాఫలాలపై ఆసక్తి చూపే వారు మంచి ఫలాలు కావాలంటే వారం, నాలుగైదు రోజుల ముందు అడ్వాన్స్‌లు ఇస్తే గాని రైతులు సీతాఫలాలను తెచ్చి పరిస్థితి లేదు. అప్పట్లో మార్కెట్‌కు వచ్చే ప్రజలు, సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు తమ వాహనాలను నిలుపుకొని ముందు సీతాఫలాలను రుచి చూసిన తర్వాతే కొనుగోలు చేసేవారు. కానీ నేడు కొనుగోలు చేసిన తర్వాతనే పండ్లను తినే పరిస్థితి ఉంది.

బాక్స్‌కు రూ.600



చెట్లు లేకపోవడంతో సీతాఫలాలు దొరకడం లేదు. వ్యవసాయ పొలాల్లో దూరంగా ఉన్న చెట్లకు ఫలాలను సేకరిస్తున్నాం. వంద కాయలుంటే బాక్స్‌ను రూ.600లకు అమ్ముతున్నాం. రెండు, మూడు రోజులకోసారి యాచారం మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తున్నాం.

– నర్సింహ, రైతు, కుర్మిద్ద

నేడే మార్కెట్‌కు వేలం



సీతాఫలాల మార్కెట్ నిర్వహణకు సంబంధించి వేలంను బుధవారం జీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నాం. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీలతల ఆధ్వర్యంలో నిర్వహించే వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చు. బస్టాండ్ సమీపంలోని నిర్వహణ చేపట్టేలా కృషి చేస్తున్నాం.

– తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి, యాచారం

15 ఏళ్లుగా తింటున్నాం



మార్కెట్లో ఎంతో రుచికరంగా లభించే సీతాఫలాలు మరెక్కడా దొరకవు. 15 ఏళ్ల కింద యాచారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన నాటి నుంచి ఏటా మా కుటుంబ సభ్యులం ఇక్కడి ఫలాలను తింటున్నాం. ఏటా ప్రత్యేకంగా యాచారం మార్కెట్‌కు వచ్చి తీసుకెళ్తా.

– ఆంజనేయులు, సీఐ, వికారాబాద్

గాలికుంటు టీకాల పంపిణీ



ఆమనగల్లు: పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

ఆమనగల్లు: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని ఆమనగల్లు పశువైద్యాధికారి చింతోజు అగ్నివేష్ సూచించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు ఇస్తున్నామన్నారు. మంగళవారం పట్టణంలో గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 89 ఆవులు, 169 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానొద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీష్, రమేశ్, ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: మండల కేంద్రంతో పాటు అవురుపల్లి గ్రామంలో మంగళవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి శ్రీకర్ రెడ్డి తెలిపారు. నెల రోజుల పాటు గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు ఆయన చెప్పారు. పాడి రైతులు పశువులకు ముందు గానే టీకాలను వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్ యాదవ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా గౌడ సోదరులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

డీజే నిర్వాహకులపై కేసు

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా డీజేలతో భారీ శబ్దాలు సృష్టించిన వారిపై కేసు నమోదు చేసినట్లు మాడ్గుల సీఐ జగదీష్ తెలిపారు. ఈ నెల 13న దసరా సందర్భంగా మాడ్గుల, ఇర్విన్, అర్కపల్లి గ్రామాల్లో డీజేలు వాడి పరిమితికి మించి శబ్దం విడుదల చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ఇక ముందు నిబంధనలకు వ్యతిరేకంగా డీజేలు వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు క్విజ్ పోటీలు

చంపాపేట: ఆర్క్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్రిస్టేజ్ సమావేశ మందిరంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలాపూర్, సరూర్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ఎలాంటి రుసుం లేకుండా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సీఐ మధును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

మంచాల: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు సూచించారు. మంగళవారం రాత్రి ఏసీపీ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు. పోలీసులు సైతం ప్రజల కోసమే నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మంచాల సీఐ మధు, ఎస్సై లాలయ్య, ఏఎస్సై సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఐ పర్యటన

గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మంచాల సీఐ మధు కోరారు. ఆరుట్ల, బండలేమూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు నూతనంగా విధులు చేపట్టిన సీఐ మధును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. ఎలాంటి గొడవలు తలెత్తకుండా స్నేహభావంతో మెలగాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

మహేశ్వరం: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీగా రాయితీ అందిస్తోందని, ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఉద్యానవన అధికారిణి సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. పామాయిల్ మొక్క ఒకటి రూ.200 ఉండగా రైతులకు 90 శాతం సబ్సిడీలో రూ.20లకే అందజేస్తున్నామని తెలిపారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటుందన్నారు. మొక్కల రాయితీపై ఎకరాల్లో ఎటువంటి పరిమితి లేదు. ఆయిల్‌పామ్ రైతులకు డ్రిప్ రాయితీ అందిస్తున్నామన్నారు. డ్రిప్ రాయితీ 12.5 ఎకరాలకు పరిమితం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ అందిస్తున్నారని తెలిపారు. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ రైతులకు 80–90 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.4200 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తారని, నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుందన్నారు. పండ్ల తోటలు వేసుకునే రైతులకు 3 సంవత్సరాల పాటు మెయింటనెన్స్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మల్చింగ్ వేసుకునే రైతులకు 50 శాతం రాయితీ, నీటి కుంటలకు 50 శాతం రాయితీ, కూరగాయ పందిర్లకు 50 శాతం రాయితీ, వెదురు మొక్కలపై రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. జీడిమెట్ల నుంచి రైతులకు ఉచితంగా టమాటా, వంకాయ, మిర్చి, క్యాబేజీ, క్యాలీ ఫ్లవర్, నారును ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. నారు అవసరం ఉన్న రైతులు 30రోజుల ముందుగా మండల ఉద్యానవన అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం మహేశ్వరం వ్యవసాయ, ఉద్యానవన అధికారుల కార్యాలయాలను, మండల ఉద్యానవన అధికారి సౌమ్య ఫోన్ నెంబర్ 8977714221 సంప్రదించాలన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్: మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఫార్చ్యున్ బటర్‌ఫ్లై పాఠశాల వ్యవస్థాపకుడు శేషగిరి రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ పాఠశాల వద్ద అబ్దుల్ కలాం జయంతిని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు.

విద్యుత్ శాఖలో భారీగా బదిలీలు



ఇబ్రహీంపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ అడిషనల్ ఇంజనీర్ జి.సైదులు నగరంలోని ఇబ్రహీంబాగ్‌లో కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు(సీఎస్‌సీ)కు బదిలీ కాగా అతని స్థానంలో ఆమనగల్లు మండల విద్యుత్ ఏఈ సీతారాములు పదోన్నతిపై మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం మండల విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు కార్పొరేట్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తుర్కయంజాల్ సబ్‌స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో అబ్దుల్లాపూర్‌మెట్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఇక్కడికి వచ్చారు. యాచారం, మంచాల మండలాల ఏఈలు సందీప్ కుమార్, సత్యనారాయణలు నగరంలోని కంట్రోల్ బ్రేక్ డౌన్ సిస్టం(సీబీడీ) కార్యాలయానికి బదిలీ అయ్యారు. దండుమైలారం లైన్‌మెన్ రాందాసు అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ కాగా అక్కడి లైన్‌మెన్ రవీందర్ ఇక్కడికి వస్తున్నారు.

ఆమనగల్లు పరిధిలో..

ఆమనగల్లు: ఆమనగల్లు విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ సీతారాములు బదిలీ అయ్యారు. ఏడీఈగా పనిచేస్తున్న శ్రీనివాసులు జిల్లాలోని తుర్కయంజాల్ ఏడీఈగా బదిలీ కాగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏడీఈగా పనిచేస్తున్న బాలకృష్ణ ఆమనగల్లుకు వచ్చారు. అలాగే ఏఈగా పనిచేస్తున్న సీతారాములుకు ఏడీఈగా పదోన్నతి లభించింది. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న శంకర్‌నాయక్ ఏఈగా ఆమనగల్లుకు రానున్నారు. కాగా ఏడీఈ శ్రీనివాస్‌లు, ఏఈ సీతారాములు మంగళవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు.

ఎర్రజెండాతో పేదలకు న్యాయం



జెండావిష్కరణలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి, నర్సింహ తదితరులు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి

యాచారం: ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల పక్షాన పోరాటాలు చేసేది సీపీఎం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో మంగళవారం పార్టీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ, రైతుబంధు, ధరణిలో భూ సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదని అన్నారు. జెండావిష్కరణ చేసిన అనంతరం గ్రామ శాఖల నూతన కార్యదర్శులుగా గుడ్ల జంగయ్య, పోలె శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు జగన్, మొగులయ్య, యాదయ్య, జంగయ్య, శ్రీను, వెంకటేష్, కృష్ణ, సత్తయ్య, రాములు, శివ, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



మాడ్గుల: బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కలకొండ, ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాధితులకు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు కారణాలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకునేందుకు పేదలకు సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ జగన్‌గౌడ్, నాయకులు కొండల్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: చెక్కు అందజేస్తున్న చైర్ పర్సన్

తుర్కయంజాల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో మేలు చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. మంగళవారం ఆమె కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్యతో కలిసి కమ్మగూడకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. వారిలో ఆర్.నాగేశ్వరరావు, జి.యాదగిరి, ఆర్.రవిదాస్, ఎస్.లక్ష్మణ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో కమ్మగూడ మాజీ సర్పంచ్ వలిగె బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



ట్రంక్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధి ద్వారకాతిరుమల్ కాలనీ నుంచి రెడ్డికాలనీ వరకు జరుగుతున్న ట్రంక్‌లైన్ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పనులు పూర్తయితే వివిధ కాలనీల వాసులకు వరదనీటి సమస్య తీరుతుందన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ మల్లికార్జునగౌడ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి



శిబిరంలో నాయకులు

కడ్తాల్: భవన నిర్మాణ కార్మికులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ సూచించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వంపుగూడ గ్రామంలో భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మంగళవారానికి 13వ రోజుకు చేరుకున్నాయి. శిక్షణ శిబిరాన్ని ఎంపీటీసీ మాజీ సభ్యుడు పర్వతాలు యాదవ్‌తో కలిసి అశోక్ పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణ నిపుణులు పుష్పాంజలి, ప్రభాకర్ నాయకులు శివ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

తుర్కయంజాల్: పార్కు స్థలాలను ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తొర్రూరు రెవెన్యూ పరిధి బ్రాహ్మణపల్లిలోని జన చైతన్య వెంచర్‌లోని పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతుండగా కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనార్థం కేటాయించిన స్థలాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ



సభలో పాల్గొన్న ఎంపీడీఓ బాలశంకర్, ఇతరులు

మంచాల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని మంచాల ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నోముల గ్రామంలో ఉపాధిహామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామ సభల ద్వారా పనులను గుర్తించడమే కాకుండా బడ్జెట్ కూడా ప్రతిపాదిస్తామన్నారు. వ్యవసాయ పొలాలు, అటవీ ప్రాంతం, చెరువులు, కుంటల వద్ద చేసే వివిధ రకాల పనులు గుర్తించారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బలరాంనాయక్‌ను కలిసిన నేతలు



ఆమనగల్లు: మహబూబాబాద్ ఎంపీ బాల్‌రాం నాయక్‌ను మంగళవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా ఆర్యవైశ్యసంఘం నేత బికుమాండ్ల రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో గిరిజన జనాభా అధికంగా ఉందని, తండాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని ఎంపీ బలరాం నాయక్‌ను కోరారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

తలకొండపల్లి: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ అన్నారు. బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపట్టాలన్నారు. దేశంలో ఉన్న ఆయా పార్టీల్లో మాదిరిగా బీజేపీలో కుటుంబ పాలన, ఆధిపత్యం ఉండవన్నారు. ఇప్పటి వరకు 1,000 మందిని సభ్యత్వ నమోదు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.